ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
జయశంకర్ భూపాలపల్లి
గురువారం 23 జనవరి 2025



క్యాడర్ కాదు.. లీడర్

పాలిటిక్స్‌పై యువతలో పెరుగుతున్న ఆసక్తి



భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాజకీయ రంగంపై గ్రామీణ యువతకు ఆసక్తి పెరుగుతోంది. ఏదో ఒక వృత్తిలో కొనసాగుతున్న కొందరు, ఇప్పటికే ఆయా పార్టీల్లో జెండాలు మోసిన వారు మరికొందరు, స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఇంకొందరు.. నాయకులుగా ఎదగాలని అనుకుంటున్నారు. ప్రజలతో మమేకమవుతూ వారికి మరింతగా చేరువ కావాలనే దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. క్యాడర్ నుంచి లీడర్‌గా మారాలనే లక్ష్యం ఇటీవల యువతలో బలంగా కనిపిస్తోంది. అంతేకాదు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి తమ సత్తాను చాటుకోవాలని అనుకుంటున్నట్టు తెలుస్తోంది. సర్పంచ్ నుంచే ప్రస్థానం ఆరంభిద్దామనే ఆలోచన చాలా మంది గ్రామీణ యువజనుల్లో కనిపిస్తోంది. గతంలో ఎన్నడూలేని విధంగా 'స్థానిక రాజకీయాలపై ఫోకస్ పెట్టారు.

సామాజిక కార్యక్రమాలతో..


గ్రామీణ రాజకీయాల్లో కీలకంగా మారి ప్రజాప్రతినిధిగా తమ ప్రస్థానాన్ని ప్రారంభించాలనే ఆలోచన పెరిగిన నేపథ్యంలో ప్రజల్లో మమేకం కావడానికి యువజనులు స్వచ్ఛంద సామాజిక కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని తెలుస్తోంది. పేదలకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేయడం, ఆస్పత్రుల్లో ఉన్న వారిని పరామర్శించి బ్రెడ్లు, పాలు అందించడం లాంటి చిన్న చిన్న కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో ఫేమస్ కావాలని ఉవ్విళ్లూరుతున్నారు. ముఖ్యంగా తోటి యువకుల మద్దతును కూడబెట్టుకోవడానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలుస్తోంది. క్రికెట్, వాలీబాల్ లాంటి పోటీలు నిర్వహిస్తూ ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నారు. ఇలా సర్పంచ్ కావాలనే లక్ష్యంతో మంది యువత ప్రజలతో నిత్యం టచ్‌లో ఉంటున్నారు. నిరక్షరాస్యులైన, నిరుపేదలకు తోచిన సాయం చేస్తూ వచ్చే ఎన్నికల్లో తాము బరిలో ఉంటామనే సంకేతాలు చెప్పకనే చెబుతున్నట్టు తెలుస్తోంది. ఎవరి ద్వారా ఓట్లు పడతాయో వారిని తమ వెంట తిప్పుకుంటూ వివిధ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. పార్టీలకు సంబంధం లేనప్పటికీ తామున్న మండల స్థాయి నేతలతో పాటు నియోజకవర్గంలో ఎమ్మెల్యే దృష్టిలో పడేందుకు చాలా మంది యువత శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ప్రజాప్రతినిధులుగా ఉన్న వారిని.. వయస్సు పైబడిన వారిని ప్రజలే ఈసారి పక్కన బెడితే ఈ సారి సర్పంచ్‌గా తమకు పట్టం కట్టబెట్టాలనే బలమైన కోరికను ప్రజల ముందు పెడుతున్నట్టు తెలుస్తోంది.

రిజర్వేషన్ల ఖరారుపై ఉత్కంఠ

పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లపై నెలకొన్న ఉత్కంఠత ఇప్పటికీ వీడలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లలో రెండు పర్యాయాలు రిజర్వేషన్లలో మార్పులు జరిగాయి. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ సర్కారు గతంలో ఉన్న రిజర్వేషన్లను మారుస్తుందా.. లేదా? అనే విషయంలో సందిగ్ధత నెలకొంది. ఈ రిజర్వేషన్లు మారితే యువతలో కొందరికి మోదం.. మరికొందరికి ఖేదం తప్పదని తెలుస్తోంది. అయితే.. ఇప్పటికే ఓటర్ల తుది జాబితాను సైతం అధికారులు ప్రకటించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బ్యాలెట్ బాక్సులు, గుర్తుల కరపత్రాలు సైతం సిద్ధం చేశారు. ఫిబ్రవరిలోనే ఎన్నికలు ఉంటాయనే ఊహాగానాలు వస్తున్న క్రమంలో యూత్‌లో జోష్ పెరుగుతోంది.

కొలువుదీరిన కొత్త పంచాయతీలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కొత్త పంచాయతీలు కొలువుదీరాయి. జిల్లాలో మొన్నటి వరకు ప్రస్తుతం 241 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇటీవల కొత్తగా ఏడు గ్రామ పంచాయతీలకు గెజిట్ విడుదలైంది. భూపాలపల్లి మండలంలో గొర్లవీడుతండా, కొంపెల్లితండా, చిట్యాల మండలంలో రామచంద్రాపురం, మొగుళ్లపల్లి మండలంలో బద్దంపల్లి, కొత్తపల్లిగోరి మండలంలో కొత్తపల్లి, బాలయ్యపల్లి, చిన్నకోడెపాక కొత్త పంచాయతీలుగా ఏర్పడ్డాయి. ఈ ఏడు పంచాయతీలతో జిల్లాలోని జీపీల సంఖ్య 248కి చేరింది. పాత పంచాయతీలపాటు కొత్తగా ఏర్పడిన వాటికి సైతం ఎన్నికలు జరగనున్నాయి.



ప్రజలకు సేవ చేయాలయనే సంకల్పంతో ఉన్నా..

- నంగావత్ భాస్కర్‌నాయక్, గొర్లవీడుతండా

కొత్తగా మా గ్రామం పంచాయతీగా ఏర్పడటం చాలా ఆనందంగా ఉంది. దీంతో గ్రామం మరింత అభివృద్ధి చెందుతుంది. ప్రభుత్వ పథకాలతో కూడా ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారు. అన్ని కూలమై అవకాశమొస్తే సర్పంచ్‌గా పోటీ చేయాలనుకుంటున్నాను. తద్వారా ప్రజా సేవ చేయాలనే సంకల్పం బలంగా ఉంది.

శివ శివా.. ఏమిటిదీ?

గాడి తప్పుతున్న కాళేశ్వరాలయ వ్యవస్థపై భక్తుల్లో అసహనం

'గర్భగుడిలో షూటింగ్'పై వెల్లువెత్తుతున్న విమర్శలు

కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించాలంటూ డిమాండ్



కాళేశ్వరం ఆలయం

7లో..

దక్షిణాదిన వెలిసిన త్రిలింగాలలో ఒకటిగా విరాజిల్లుతున్న కాళేశ్వరం ముక్తీశ్వరాలయంలో నిర్వహణ, పాలనాపర అంశాలపై అసహనం వ్యక్తమవుతోంది. కొందరు అధికారుల పట్టింపులేని తనం.. అర్చకుల చేతివాటంతో ఆలయ ప్రతిష్ఠకు భంగం కలుగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దక్షిణ కాశీగా పేరు ప్రఖ్యాతలు పేరుగాంచిన ఈ క్షేత్రంలో అనుమతులేకుండా ప్రైవేట్ వ్యక్తులు గర్భాలయంలో పాట చిత్రీకరణ చేయడం తీవ్ర చర్చనీయాశమైంది. ఈ షూటింగ్ సమయంలో ఆలయ తలుపులు మూసి దర్శనాలను నిలిపేయడంతో భక్తులు గంటల తరబడి నిరీక్షించారు. ఇదే కాదు కొన్ని నెలలుగా అర్చకులదే ఇష్టారాజ్యంగా మారిందని, అధికారులు, సిబ్బంది కూడా పట్టించుకోకపోవడం, అర్చకులు, సిబ్బంది రెండు గ్రూపులుగా విడిపోవడం లాంటి వాటితో ఆలయ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతం కన్నా ఇక్కడికి వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న సమయంలో దేవస్థానంలో నెలకొన్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తోందని వారు వాపోతున్నారు.

- మహదేవపూర్, ఆంధ్రజ్యోతి

డబ్ల్యూఈఎఫ్ వ్యవస్థాపకుడితో శ్రీధర్‌బాబు భేటీ



ప్రొఫెసర్ క్లాస్ శ్వాబ్‌తో మంత్రి శ్రీధర్‌బాబు

మహదేవపూర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : దావోస్‌లో పర్యటిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వ్యవస్థాపకుడు, ప్రపంచ ఆర్థిక విధానాలను ఆవిష్కరించిన ప్రొఫెసర్ క్లాస్ శ్వాబ్‌తో బుధవారం భేటీ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధి తీరు తెన్నులపై చర్చించారు. భారత ఆవిష్కరణల రాజధానిగా తెలంగాణ ఎదగడంలో దోహదం చేసిన అంశాలను మంత్రి వివరించారు. భవిష్యత్‌లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ కీలక పాత్ర పోషించనుందని తెలిపారు. స్థిరమైన అభివృద్ధి, వనరుల సమతుల్యంతో కూడిన ఆర్థిక వ్యూహాలను మంత్రి వివరించారు.

కాళేశ్వరాలయ కార్యాలయం వద్ద బీజేపీ ధర్నా


ఈవోను సస్పెండ్ చేయాలని డిమాండ్



ఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

మహదేవపూర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు బుధవారం ధర్నా చేశారు. రెండు రోజుల క్రితం ఎలాంటి అనుమతులు లేకుండా గర్భగుడి తలుపులు పెట్టి ప్రైవేటు ఆల్బమ్‌ను చిత్రీకరించడం వివాదానికి దారి తీసింది. పుణ్యక్షేత్రంలో ఇలా చిత్రీకరణ చేయడం అపచారమంటూ బీజేపీ నేతలు మండిపడ్డారు. సుమారు రెండు గంటల పాటు కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈవో మారుతిని వెంటనే సస్పెండ్ చేయాలని, గాయని మధుప్రియపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చల్లా నారాయణరెడ్డి, మనోజ్, బొల్లం కిషన్, గోర శ్రీకాంత్, గోర దేవయ్య, పిట్టల మహేష్‌తో పాటు 30 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

కాపర్ వైరు చోరీ కేసులో ఏడుగురి అరెస్టు



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

గణపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలోని ఓపెన్‌కాస్టు-3లో రెండు రోజుల క్రితం కాపర్ వైరు చోరీ యత్నం కేసులో ఏడుగురిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గణపురం బస్టాండ్‌లో అనుమానాస్పదంగా చిన్న చిన్న సంచులతో ఉన్న ఏడుగురిని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఓసీ-3 సమీపంలో కాపర్ ముక్కలు చోరీ చేసినట్లు తెలిపారు. సుమారు 40మీటర్ల కాపర్ వైరు రూ.40 వేలు విలువ చేస్తుందని దాన్ని అమ్ముకోవడానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు వెళ్తున్నట్లు నేరాన్ని ఒప్పుకున్నట్లు పేర్కొన్నారు. అరెస్టైన వారిలో మణుగూరుకు చెందిన రౌతు భరత్, పల్లపు నర్సింహరావు, కల్నూరి కనకయ్య, రౌతు మల్లేశ్వరి, మక్కల రజిత, రౌతు రమాదేవి, బోదాసు చిట్టి ఉన్నారని ఎస్సై తెలిపారు.

వైద్యులు సమయం పాటించాలి : డీఎంహెచ్‌వో

మొగుళ్లపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా సమయపాలన పాటించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి మధుసూదన్ అన్నారు. బుధవారం ఆయన మొగుళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది హాజరు రిజిష్టర్‌ను పరిశీలించి ఆరోగ్య ఉపకేంద్రాల పనితీరును డాక్టర్ నాగరాణిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఇస్సిపేటలోని సబ్‌సెంటర్‌ను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఆయనవెంట డాక్టర్ నవత, హెల్త్ సూపర్‌వైజర్‌లు సునీత, జమున, స్టాఫ్‌నర్సులు సరిత, కల్పన, సిబ్బంది ఉన్నారు.

అర్హులకే సంక్షేమ పథకాలు

గ్రామ సభల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



కాశీంపల్లి గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎస్ఆర్

భూపాలపల్లిటౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులకే అందుతాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పష్టం చేశారు. వచ్చే నాలుగేళ్లలో పేదవాడి సొంతింటి కల నెరవేరుస్తామన్నారు. భూపాలపల్లి మండలంలోని జంగేడు, కాశీంపల్లి, గొర్లవీడు గ్రామాల్లో బుధవారం జరిగిన గ్రామ సభలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయడమే గ్రామ, వార్డు సభల ఉద్దేశమన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ పథకం, రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాలను ఈ నెల 26 నుంచి అందించడమే లక్ష్యంగా సభలు నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజాపాలన, కులగణన సర్వేలో భాగంగా సేకరించిన ఫిర్యాదులతో పాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారి వివరాలను సిబ్బంది ఇంటింటికి వెళ్లి సేకరించి ఎంపిక చేసినట్టు తెలిపారు. లబ్ధిదారుల వివరాలను గ్రామ సభల్లో ప్రజల సమక్షంలో చదివి ఎంపిక చేస్తున్నట్టు పేర్కొన్నారు. మునిసిపల్ వార్డులు, గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద కూడా బహిరంగ పరుస్తున్నట్టు తెలిపారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు పథకాలు నిరంతర ప్రక్రియ అని, అర్హత ఉన్నప్పటికీ పథకంలో పేరులేని వారు నిరాశ నిస్పృహలకు లోనుకానవసరం లేదని స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం పథకాలు అర్హులకు అందిస్తామన్నారు. అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సిద్ధార్థ్, మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్, మెప్మా పీడీ రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకత కోసమే గ్రామ సభలు

గణపురం (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలను అర్హులకు అందించేందుకు పారదర్శకత కోసమే ప్రభుత్వం గ్రామ సభలను నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని గాంధీనగర్, మైలారంలో జరిగిన గ్రామసభల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ పథకం తదితర కార్యక్రమాలను ఈనెల 26న అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు రాకేష్, నవీన్, మాజీ జడ్పీటీసీ ముత్యాల రాజయ్య, కాల్వ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోచంపల్లిలో గ్రామ సభ

రేగొండ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోచంపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేతారావు, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టన్న, పీఏసీఎస్ చైర్మన్ విజ్జన్‌రావు, కాంగ్రెస్ నాయకులు మోడెం ఉమేష్‌గౌడ్, ముద్దమల్ల రఘు, రవి, కట్ల నర్సింహరెడ్డి, ఇండ్ల రవి, వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, అన్నారెడ్డి పాల్గొన్నారు.

జాబితాలో పేర్లు లేకుంటే మళ్లీ దరఖాస్తు చేసుకోండి

గ్రామ సభల్లో కలెక్టర్ రాహుల్ శర్మ



ధన్వాడ గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

కాటారం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికీ అందుతాయని, ఎవరూ ఆందోళన చెందొద్దని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అన్నారు. గ్రామసభ ల్లో చదివిన జాబితాల్లో పేర్లు రానివారు మళ్లీ దరఖాస్తులు చేసుకుంటే తీసుకుని అర్హులైతే పథకాలు మంజూరు అవుతాయన్నారు. మండలంలోని ధన్వాడ, కొత్తపల్లి జీపీల పరిధి లో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిట్యాల శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు పాగె రంజిత్, పలువురు ప్రజలు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల జాబితాలు తప్పుల తడకగా ఉన్నాయని, చాలామంది పేదవాళ్ల పేర్లు రాలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ అర్హులైన వారందరికీ రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందుతాయన్నారు. గ్రామసభల్లో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద జాబితాల్లో పేర్లు లేనివారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న గ్రామసభల్లో చదువుతున్న జాబితాల్లోని పేర్లు దరఖాస్తుదారులవే నన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు విచారణ చేసిన అనంతరం అర్హులైన వారిని మాత్రమే ఆయా పథకాలకు లబ్ధిదారులుగా ఎంపిక చేస్తామన్నారు. పలుచోట్ల గ్రామసభల్లో అనర్హుల పేర్లు ఇందిరమ్మ ఇళ్ల జాబితాల్లో ఉన్నాయని తమ దృష్టికి తీసుకొచ్చారని, అలాంటి వారి పేర్లను గుర్తించి అధికారులు తొలగిస్తారని వెల్లడించారు. అలాగే ధన్వాడ, కొత్తపల్లి, గంగారం, దామెరకుంట, చిద్నెపల్లి తదితర జీపీల్లో జరిగిన గ్రామసభల్లో మహిళలు, యువకులు పేదవాళ్లమైన తమ పేర్లు లిస్టుల్లో ఎందుకు రాలేదని అధికారులతో వాగ్వాదానికి దిగారు. దరఖాస్తులు మళ్లీ చేసుకోవాలని, ప్రభుత్వం పథకాలను నిరంతరంగా ఇస్తామని చెప్పిందని, ఆందోళన చెందవద్దని డీఆర్‌డీవో నరేష్, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి హామీ ఇచ్చారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ రాహుల్‌శర్మ టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. గణతంత్ర వేడుకలు నిర్వహించే అంబేద్కర్ స్టేడియంలో ప్రొటోకాల్ ప్రకారం అతిథులు కూర్చునేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. వేడుకలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ముఖ్యంగా తాగునీటి సౌకర్యం, షామియానాలు, కుర్చీలు ఏర్పాటుచేయాలన్నారు. వేడుకల్లో విద్యార్థులతో దేశభక్తి గీతాలకు నృత్య ప్రదర్శనలకు ఏర్పాటుచేయాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించేందుకు ఆయా శాఖల అధికారులు 23వ తేదీ వరకు జాబితా ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీపీఆర్వో శ్రీనివాస్, డీఈవో రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ప్రారంభమైన

చిన్నకాళేశ్వరం కెనాల్ పనులు

మహదేవపూర్ రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : చిన్నకాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మందరంచెరువు నుంచి ఎన్కపల్లి వరకు చేపట్టబోయే మెయిన్ కెనాల్ ట్రెంచ్ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. రాపల్లికోట శివారులోని పత్తిచేలల్లో పనులను అధికారులు ప్రారంభించారు. వారం రోజుల క్రితం పంట చేతికొచ్చాక పరిహారం అందించి పనులు మొదలెట్టాలని రైతులు కోరారు. ఈ నేపథ్యంలో మంగళవారం వరకు పనులు ఆపేశారు. తాజాగా బుధవారం ట్రెంచ్ పనులు చేపట్టడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిహారం ఇవ్వకుండానే పనులెలా మొదలు పెడతారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు పరిహారం అందేలా చర్యలు తీసుకున్నాకే పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారుల తీరు దారుణంగా ఉందని, కనీసం రైతుల సమస్యలేమిటో కడా తెలుసుకేందుకు ముందుకురాకుండా పనులు చేపడుతున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



రహీం (ఫైల్)

మహదేవపూర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఎండీ.రహీం(20) మహారాష్ట్ర సిరొంచలో జరిగిన ఉర్సులో పాల్గొని మరో యువకుడు అర్బాజ్‌తో కలిసి బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యాడు. తెలంగాణ వంతెన వద్ద పనులు సాగుతుండగా ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో ఆ రహదారిపై బైక్ అదుపు తప్పింది. కిందపడిపోవడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందుతున్న క్రమంలో బుధవారం సాయంత్రం .రహీం మృతిచెందాడు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మానుకోట ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



మహబూబాబాద్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మోసపూరిత వాగ్దానాలు, ప్రకటనలతో మోసాలకు పాల్పడుతున్న మల్టీలెవల్ మార్కెటింగ్ స్కీముల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రజల సొమ్మును దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త కొత్త పోకడలతో ప్రజల బలహీనతలను పెట్టుబడిగా చేసుకునేందుకు సైబర్ నేరగాళ్లు కొంతపంథాలను ప్రయోగిస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే మల్టీలెవల్ మార్కెటింగ్ స్కీం, పిరమిడ్, బిట్‌కాయిన్, వీక్స్ కాయిన్, యాబిట్‌కాయిన్, యూరిక్స్ కాయిన్ లాంటి స్కీముల ద్వారా ప్రజల నుంచి డబ్బులను దోచుకుంటున్నట్లు చెప్పారు. మొబైల్ లేదా సోషల్ మీడియా ప్లాట్‌ఫాం అయిన ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగ్రామ్, టెలిగ్రామ్, ట్విట్టర్ అకౌంట్ ఉన్న వినియోగదారులకు వివిధ రకాల లింకులను పెడుతున్నారని, వాటిని క్లిక్‌చేసి తమ బ్యాంకు ఖాతాఖాళీ చేసుకోవద్దని హెచ్చరించారు. ఎక్కువ సంఖ్యలో ప్రజలు ఆ యాప్‌ల్లో జాయిన్ అయి ఎక్కువ పెట్టుబడులు పెట్టాక ఒకేసారి కంపెనీని ఎత్తివేస్తున్నారని చెప్పారు. అలాంటి ఫేక్ సోషల్ మీడియా ప్రకటనలను నమ్మొద్దని చెప్పారు. జిల్లాలో జరుగుతున్న సైబర్ నేరాలను జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ శ్రీనివాస్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ బాధితులను వెంటనే పోలీస్‌స్టేషన్‌లో సైబర్ వారియర్స్‌ను కలిసేలా చేసి సంబంధిత బ్యాంకు వారితో మాట్లాడి అకౌంట్‌ను హోల్డింగ్‌లో ఉంచడం, గ్రామాల్లో సైబర్ వారియర్స్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. సైబర్ మోసపోతే టోల్ ఫ్రీనెంబర్ 1930కు సమాచారం అందించాలన్నారు.

కేయూలో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కేయూలో యువతకు నిర్వహించే రెండు రోజుల శిక్షణకు ఈనెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ బుధవారం తెలిపారు. నెహ్రూ యువకేంద్రం వరంగల్- యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 25, 26న మత్తు, మాదక ద్రవ్యాల నియంత్రణపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 18 నుంచి 29 సంవత్సరాలలోపు వయస్సు ఉండాలని, ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజన వసతి, రవాణ ఖర్చులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మహబూబాబాద్ జిల్లా యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తిగల యువకులు హనుమకొండ బస్టాండ్ సమీపంలోని నెహ్రూ యువకేంద్రం కార్యాలయంలో ఈనెల 24 మధ్యాహ్నం 2 గంటలలోపు సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 0870-2958776ను సంప్రదించాలన్నారు.

ఇద్దరు ఫారెస్టు ఉద్యోగుల సస్పెన్షన్

కాకతీయఖని, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ డివిజన్ పరిధి పెగడపెల్లి రేంజ్‌లో పనిచేస్తున్న ఇద్దరు అటవీశాఖ ఉద్యోగులు సస్పెండ్ అయినట్లు సమాచారం. బోర్లగూడెంలో అటవీ, వన్యప్రాణుల సంరక్షణలో నిర్లక్ష్యం వహించినందుకు ఇద్దరు బీట్ అధికారులపై డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు సమాచారం. అలాగే పెగడపెల్లి డీఆర్‌వో సస్పెన్షన్‌కు సీసీఎఫ్‌కు నివేదిక పంపినట్లు తెలిసింది. ఈ విషయమై డీఎఫ్‌వో నవీన్‌రెడ్డిని ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

కోటంచలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

రేగొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని కోటంచ ఆలయంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం పురస్కరించుకుని ఉదయం సుదర్శన నారసింహహోమం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి అభిషేకం చేశారు. మధ్యాహ్నం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధాన అర్చకుడు బుచ్చమాచార్యులు, ఈవో మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పట్టపగలు నడిరోడ్డుపై దారుణ హత్య

- ఆటో డ్రైవర్‌పై కత్తితో మరో ఆటో డ్రైవర్ దాడి
- తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి
- వివాహేతర సంబంధం నేపథ్యంలోనే ఘాతుకం
- హనుమకొండ అదాలత్ జంక్షన్ సమీపంలో ఘటన

హనుమకొండ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్ట పగలు.. మిట్ట మధ్యాహ్నం.. నగరం నడిబొడ్డు.. తీవ్ర జన సంచారం.. వాహనాల రాకపోకలతో బిజీగా ఉన్న ప్రధాన రహదారిపై ఓ ఆటో డ్రైవర్‌ను మరో ఆటోడ్రైవర్ కత్తితో దాడి చేసి హత్య చేశాడు. అందరూ చూస్తుండగానే జరిగిన ఈ ఘాతుకంతో అక్కడున్నవారు భయాందోళనకు గురయ్యారు. సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి హనుమకొండ అదాలత్ జంక్షన్ సమీపంలో జరిగింది. ఈ దారుణహత్యకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

కాజీపేట మండలం మడికొండకు చెందిన మాచర్ల రాజ్‌కుమార్ (45) స్థానిక ప్రభుత్వ పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్నాడు. ఈయనకు భార్య, ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. ఆటో నడుపుకుంటూ రాజ్‌కుమార్ జీవిస్తున్నారు. అలాగే మడికొండ అయోధ్యపురానికి చెందిన ఆటో డ్రైవర్ ఈనుగు వెంకటేశ్వర్లుకు వివాహమైంది. అయితే వెంకటేశ్వర్లుకు ఇదే గ్రామానికి చెందిన ఓ వివాహితతో కొన్నిరోజులుగా వివాహేతర సంబంధం ఉంది. కాగా, అదే మహిళతో రాజ్‌కుమార్ ఇటీవల సన్నిహితంగా ఉంటున్నాడు. ఇది గమనించిన వెంకటేశ్వర్లు రాజ్‌కుమార్‌పై కక్ష పెంచుకున్నాడు. మహిళ జోలికి రావొద్దని పలుమార్లు రాజ్‌కుమార్‌ను వెంకటేశ్వర్లు హెచ్చరించాడు. ఇదే విషయమై కొన్నిసార్లు గొడవపడ్డారు. ఈ క్రమంలో సదరు మహిళ వెంకటేశ్వర్లును దూరం పెట్టింది. దీంతో ఇద్దరిపై వెంకటేశ్వర్లు కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో హనుమకొండ అదాలత్ జంక్షన్ సమీపంలో రాజ్‌కుమార్ ఆటోను, వెంకటేశ్వర్లు తన ఆటోతో వెంబడించి గొడవకు దిగాడు. ఇద్దరికి మాటామాటా పెరిగి వెంకటేశ్వర్లు తన ఆటోలో ఉన్న కత్తితో రాజ్‌కుమార్‌పై దాడి చేశాడు. రాజ్‌కుమార్ కిందపడిపోగానే కత్తితో తీవ్రంగా దాడి చేశాడు. అక్కడ ఉన్న స్థానికులు కత్తితో దాడి చేసిన వెంకటేశ్వర్లును అడ్డుకుని దేహశుద్ధి చేశారు. తీవ్రంగా గాయపడిన రాజ్‌కుమార్‌ను సుబేదారి పోలీసులు ఎంజీఎంకు తరలించగా అప్పటికే రాజ్‌కుమార్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దాడి జరిగిన ప్రాంతానికి సుబేదారి సీఐ పి.సత్యనారాయణరెడ్డి, ఏసీపీ దేవేందర్‌రెడ్డి చేరుకొని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కాగా, సీసీ కెమెరాల్లో దాడి ఘటన రికార్డు కావడంతో పోలీసులు పరిశీలించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు.



హత్యకు గురైన రాజ్‌కుమార్ (ఫైల్)

రాజ్‌కుమార్‌పై కత్తితో దాడి చేస్తున్న వెంకటేశ్వర్లు (తెల్ల చొక్కా)

ఏజెన్సీ మండల అభివృద్ధికి కృషి చేస్తా

మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న మురళీనాయక్

గూడూరు(మహబూబాబాద్ జిల్లా), జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : గూడూరు ఏజెన్సీ మండల అభివృద్ధి కోసం కృషి చేస్తానని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. గాజులగట్టులో హెల్త్ సబ్‌సెంటర్ ప్రహరీ నిర్మాణం కోసం బుధవారం భూమిపూజ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో 34 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. వెంగంపేటలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణకోసం శంకుస్థాపన చేశారు. మదనాపురంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బోడ సక్రు అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఎర్రకుంట తండాలో సీసీరోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులతో అధికారులు అక్కడక్కడ కుమ్మక్కవుతున్నారని ఆరోపించారు. మండలంలో బీఆర్‌ఎస్ నాయకులతో అధికారులు కుమ్మక్కై వారి చెప్పిన విధంగా సర్వే నిర్వహించి అనర్హులను ఎంపిక చేశారని తనకు ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. అధికారులు తిరిగి మళ్లీ సర్వే నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందించాలన్నారు. తప్పుడు సర్వే చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో వీరస్వామి, డిప్యూటీ తహసీల్దార్ కోమల, ప్రత్యేక అధికారులు సారంగపాణి, సత్యనారాయణ, లవారం, దినేష్, రాంబాబు, హేమంత్‌నాయక్, కాంగ్రెస్ జిల్లా నాయకులు ప్రదీప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చిట్టి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలు, బీరం శ్రీపాల్‌రెడ్డి, ఎడ్ల నరేష్‌రెడ్డి, బొల్లికొండ మధు, చంటిస్వామి, మాజీ సర్పంచ్ పడిగే వసంత, భట్టు రమేష్, ఎలకట్టె కార్తీక్ పాల్గొన్నారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలి

తొర్రూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి విజయసారథి, రాష్ట్ర సమితి సభ్యుడు తమ్మెర విశ్వేశ్వర రావు అన్నారు. బుధవారం తొర్రూరులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సాయుధపోరాట నేత తీగల సత్యనారాయణ రావు విగ్రహావిష్కరణ ఈ నెల 25న మహబూబాబాద్‌లో జరుగుతుందన్నారు. పార్టీ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. వంద సంవత్సరాలుగా పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్నామని తెలిపారు. ఎన్నో పోరాటాల ఫలితంగానే నేడు ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, సాయుధ పోరాట నేత తీగల సత్యనారాయణ రావు పోరాటాల ఫలితంగా నాటి మానుకోట డివిజన్‌తో పాటు ఈ ప్రాంతంలో అనేక సమస్యల కోసం ఆయన నిరంతర పోరాటం చేశాడన్నారు. పార్టీ నిర్మాణం కోసం పాటుపడిన కార్యకర్తలను ఎప్పటికి మర్చిపోదన్నారు. సభకు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సీపీఐ జిల్లా నాయకులు ఓమ భిక్షపతి, మండల కార్యదర్శి మహేందర్, కిరణ్, యాదగిరి, శ్యామ్, లక్ష్మణ్, వెంకన్న, ఎల్లయ్య, నర్సింహరెడ్డి, యాకయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయసారథి

డీటీఎఫ్ టీచర్స్ కమిటీ ఎన్నిక

తొర్రూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) మండల కమిటీని ఎంపిక చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర కౌన్సిలర్ బుధారపు శ్రీనివాస్ తెలిపారు. బుధవారం తొర్రూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అధ్యక్షుడిగా పులిపాటి తిరుమలేష్, ప్రధాన కార్య దర్శిగా బొమ్మెర కృష్ణ, ఉపాధ్యక్షులుగా ఎం.రవీందర్, కె.స్వప్నతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, నిర్మల, దర్గయ్య, కుమార స్వామి, రవీందర్, వెంకటాచారి, బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో కార్యదర్శి చేతివాటం

- డబ్బులు వసూలు చేశారంటూ ప్రజల ఆరోపణ
- గ్రామసభలో తహసీల్దార్‌కు గ్రామస్థుల వినతి
- నెల రోజు కిందటే ఆంధ్రజ్యోతిలో కథనం



ప్రత్యేకాధికారికి వినతి పత్రం ఇస్తున్న గ్రామస్థులు

కొత్తగూడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో పంచాయతీ కార్యదర్శి చేతివాటం ప్రదర్శించారు. ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.15వందల నుంచి రూ.20 వేలు వసూలు చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం చెరువుముందు తండాలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో గ్రామస్తులు మూకుమ్మడిగా జీపీ కార్యదర్శిపై ఆగ్రహం వెలిబుచ్చారు. ఇళ్ల సర్వేలో ఒక్కొక్కరి నుంచి రూ.1500 నుంచి రూ.2000 వసూలు చేసిందని ఆరోపిస్తూ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి జ్ఞానేశ్వరి అవినీతి బయట పడింది.

కాగా, పంచాయతీ కార్యదర్శి జ్ఞానేశ్వరి వసూళ్ల పర్వంపై డిసెంబరు 23న ఆంధ్రజ్యోతి పత్రికలో కథనం ప్రచురితమైంది. సర్వేలో భాగంగా ఆమె ఇంటికి రూ.1500 నుంచి 2000 చొప్పున డబ్బులు చేసిన విషయమై గ్రామస్తుల ఆరోపణలతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. కానీ అధికారులు విచారణ చేయకుండా, చర్యలు తీసుకోకుండా ఉదాసీనత పాటించారు. ఈ క్రమంలో బుధవారం జరిగిన గ్రామసభలో ప్రజలు కార్యదర్శి నిర్వాకంపై అధికారులను ప్రశ్నించారు. ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న కార్యదర్శి జ్ఞానేశ్వరిపై ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

అలుపెరుగని యాత్రికుడు

- స్వేచ్ఛ భారత్‌ను కాంక్షిస్తూ యువకుడి సైకిల్ యాత్ర
- ఉత్తరాఖండ్ నుంచి మొదలైన ప్రయాణం

వాజేడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్వేచ్ఛ భారత్ కోసం ఆ యువకుడు పరితపిస్తున్నాడు. 'క్లీన్ ఇండియా.. గ్రీన్ ఇండియా' నినాదంతో సైకిల్ యాత్ర చేపట్టాడు. ఉత్తరాఖండ్ నుంచి బయల్దేరి దేశ పర్యటన చేస్తున్నాడు. రోజుకు 100 కిలో మీటర్ల ప్రయాణం చేస్తూ ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అయిన ములుగు జిల్లా వాజేడు మండలం మండపాక గ్రామానికి బుధవారం చేరుకున్నాడు. ఆయన్ను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. ఉత్తరాఖండ్‌కు చెందిన 29 ఏళ్ల రవికాంత్ గిల్బా సైకిల్ యాత్ర చేపట్టాడు. 53 రోజులుగా ఆయన భారత్ యాత్ర పేరుతో దేశమంతటా చుట్టుముడుతున్నాడు. ఇప్పటి వరకు 5,900 కిలోమీటర్లు పర్యటించాడు. తెలంగాణ మీదుగా ఛత్తీస్‌గఢ్ వైపు వెళ్లాడు. తన గమ్యస్థానం జమ్మూకశ్మీర్ అని, మరో 80 రోజుల్లో అక్కడికి చేరుకుంటానని చెప్పాడు. మరో 9 వేల కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణం చేయాల్సి ఉందని తెలిపాడు. ఉత్తరాఖండ్ నుంచి ఇప్పటి వరకు హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హర్యానా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, గోవా, కర్నాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మీదుగా తన ప్రయాణం సాగిందని పేర్కొన్నాడు. పెట్రోల్ బంకుల వద్ద నిద్రిస్తూ ఎవరైనా ఇచ్చిన ఆహారాన్ని తీసుకుంటూ ముందుకు సాగుతున్నట్లు తెలిపాడు.



సైకిల్ యాత్ర చేస్తున్న రవికాంత్ గిల్బా

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2535	2160
పల్లికాయ (సూక)	6200	5600
పల్లికాయ (పచ్చిది)	4300	4100
కందులు	6382	5560
పెసళ్లు	2852	2800
పత్తి	7210	5800
కొత్త పత్తి	-	-
పసుపు (కాడి)	12111	10234
పసుపు (గోల)	12011	10121
తేజ మిర్చి	14600	9000
తేజ ఏసీ	13000	11000
వండర్‌హాట్ ఏసీ	15000	11500
యూఎస్ 341ఏసీ	13500	12300
యూఎస్ 341	15500	11500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం



సంకీర్తనలో పాటలు ఆలపిస్తున్న భజన మండలి సభ్యులు

హరినామ సంకీర్తనలో తాడిచర్ల వాసులు

మల్హర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొనే అవకాశం భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచర్ల గ్రామానికి వెంకటేశ్వరస్వామి భజన మండలి సభ్యులకు దక్కింది. మూడు రోజుల క్రితం తిరుమల వెళ్లిన వారు శ్రీహరి పాదాల చెంత అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొన్న వారిలో యెల్లూరి శ్రీనివాస్, ఓజల రాజబాబుతో పాటు పలువురు గ్రామస్థులు ఉన్నారు.

జాతీయస్థాయి మెంటార్‌గా రామయ్య



ములుగు కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని అబ్బాపురం జడ్పీహెచ్‌ఎస్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ కందాల రామయ్య జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి జాతీయ మెంటార్ మిషన్ (ఎన్‌సీడీఈ)గా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ వృత్తి, అభివృద్ధి కోసం ఆయన చేసిన విశేష కృషి, భారతదేశంలో విద్యా నాణ్యతను మెరుగు పరిచేందుకు చేసిన కృషికి ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు దక్కింది. ఈమేరకు రామయ్య జాతీయ మెంటార్‌షిప్ పూల్‌లో చేరేందుకు ఎన్‌సీటీఈ, జాతీయ మెంటారింగ్ కన్వీనర్ డాక్టర్ దినేష్‌కుమార్ ఈ-మెయిల్ ద్వారా బుధవారం ఆహ్వానం పంపారు. ఈ సందర్భంగా రామయ్యను జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ కె.మల్లారెడ్డి, అబ్బాపురం జడ్పీ హెచ్‌ఎం జి.భాస్కర్, ఉపాధ్యాయులు అభినందించారు.

రామప్పను దర్శించిన ఫ్రాన్స్ దేశస్థులు

వెంకటాపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామప్ప దేవాలయాన్ని ఫ్రాన్స్ దేశానికి చెందిన వృద్ధ దంపతులు జూర్లీ, అని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని తీర్థప్రసా దాలు స్వీకరించారు. అనంతరం వారు ఆలయ శిల్పకళా సందను వీక్షించి మంత్రముగ్ధులయ్యారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకుని బోటులో షికారు చేస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు.



శిల్పకళా సంపదను వీక్షిస్తున్న ఫ్రాన్స్ దేశస్థులు

తమిళనాడులో సరస్వతి విగ్రహం తయారీ

ప్రత్యేక పూజలు చేసిన కాళేశ్వరాలయ స్థపతి, ఈవో



విగ్రహాన్ని తయారు చేయనున్న శిలకు పూజ చేస్తున్న అర్చకులు

మహదేవపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేయనున్న సరస్వతీదేవి విగ్రహం తమిళనాడులోని మహాబలిపురంలో తయారవుతోంది. ఈ క్రమంలో బుధవారం అక్కడికి వెళ్లిన దేవాదాయ శాఖ స్థపతి వల్లి నాయుగం, కార్యనిర్వహణాధికారి ఎ.మారుతి, సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్ అసిస్టెంట్ స్థపతి గణేష్ విగ్రహ తయారీని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ప్రత్యేక పూజలు చేశారు.

ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

మైనార్టీ గురుకులం ప్రిన్సిపాల్ వనజ

తొర్రూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మైనార్టీ బాలికల, జూనియర్ కళాశాల గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సర ప్రవేశానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తొర్రూరు మైనార్టీ గురుకులం ప్రిన్సిపాల్ వనజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఫిబ్రవరి 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 79950 57928 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

ఓవర్ లోడ్ ఇసుక లారీల సీజ్

మల్హర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఓవర్ లోడ్‌తో వెళ్తున్న మూడు ఇసుక లారీలను సీజ్ చేసినట్లు భూపాలపల్లి జిల్లా రవాణా శాఖ అధికారి సమ్దానీ బుధవారం తెలిపారు. మంగళవారం రాత్రి మండలంలోని నాగులమ్మ క్రాస్ వద్ద ఓవర్ లోడ్‌తో వెళ్తున్న మూడు ఇసుక లారీలను పట్టుకొని సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న లారీలను కొయ్యూర్ పోలీస్ స్టేషన్ వద్ద ఉంచినట్లు చెప్పారు. పరిమితికి మించిన లోడ్‌తో రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక లారీలు

చిన్న జాతరకు చక చకా..

ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు మేడారం మినీ సంబురం

- 40లక్షల మందికిపైగా భక్తులు వస్తారని అంచనా
- సౌకర్యాల కల్పనకు రూ.5.33కోట్లు మంజూరు
- పలుశాఖల ఆధ్వర్యంలో పనులు ప్రారంభం


ట్రాక్టర్లలో చెత్త తరలిస్తున్న పారిశుధ్య సిబ్బంది

తాడ్వాయి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మేడారం మినీ జాతరకు సమయం సమీపిస్తోంది. ఫిబ్రవరి 12వ తేదీ నుంచి 15వతేదీ వరకు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగే సమ్మక్క సారలమ్మల మినీ జాతరకు పనులు చకచకా జరుగుతున్నాయి. ఈ జాతరకు సుమారు 40 లక్షల మంది భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేశారు. ఈ క్రమంలో జాతర నిర్వహణతో పాటు, బయ్యక్కపేట, కొండాయి, పునుగొండ్ల, ఐలాపూర్, తదితర చిన్న జాతరల నిర్వహణల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ.5.33కోట్ల నిధులను మంజూరు చేసిన విషయం తెలిసిందే. అలాగే పలు శాఖల ఆధ్వర్యంలో అధికారులు ప్రణాళికలు రూపొందించి పనులను ప్రారంభించారు.


పలు శాఖల ఆధ్వర్యంలో పనులు

గిరిజన సంక్షేమం ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రూ.1.12కోట్లు వెచ్చించి ఐటీడీఏ, రెవెన్యూ మూడు అతిథి గృహాల్లో ప్రత్యేక ఏర్పాట్లు, 2020లో కేంద్ర ప్రభుత్వం నిధులతో నిర్మించిన సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు, జంపన్న భక్తుల వసతి భవనాల్లో నీటి వసతి, పారిశుధ్యం, మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యుత్ మరమ్మతులు, పలు అభివృద్ధిపనులు, 2018లో నిర్మించిన 27 షాపింగ్ కాంప్లెక్స్‌లలో మరమ్మతు పనులు, పారిశుధ్య కార్మికుల వసతి షెడ్లలో మరమ్మతుల కోసం, బయ్యక్కపేట వనదేవతల జాతర నిర్వాహణ సౌకర్యాలు, ఐలాపూర్ జాతరలో నూతన సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం, నీటి సరఫరా కోసం కొత్త బోరు, మోటార్ ఏర్పాటు, కొండాయి గ్రామంలో ఉన్న ఆర్చికి పెయింటింగ్, జాతర పరిసరాల్లో కాంపౌండ్‌వాల్ పనులను చేపట్టనున్నారు.

- గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూ. 1.47 కోట్లు వెచ్చించారు. వాటితో మేడారంలో పూజారుల అతిథి భవనానికి సీసీ రోడ్డు, భవనం చుట్టూ ప్రహరీ, వంట షెడ్ నిర్మాణం, చిలకలగుట్ట రోడ్ నుంచి సమ్మక్క గుడి వరకు నూతన సీసీ రోడ్ నిర్మాణం, కన్నెపెల్లి సారలమ్మ గుడి వద్ద పూజారుల వసతి ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాల ఏర్పాట్లు, బయ్యక్కపేట గ్రామంలో ఎస్సీ కాలనీ నుంచి తాళ్లతోగు వరకు నూతన సీసీ రోడ్‌తోపాటు మట్టి రోడ్ నిర్మాణం, పునుగొండ్ల గ్రామంలో పగిడిద్దరాజు గుడి వద్ద భూమి చదును పనులు, మహబూబబాద్ జిల్లాలోని గంగారం గ్రామంలోని పగిడిద్దరాజు గుడి వద్ద సీసీ రోడ్ నిర్మాణం చేయనున్నారు.


మేడారం పరిసరాలలో డీటీఆర్‌లను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

- నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో రూ. 12.90లక్షల నిధులను వెచ్చించి మినీ జాతర నిర్వహణకు పనులను చేపట్టనున్నారు.
- పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 18.83లక్షల నిధులను వెచ్చించి ఊరట్టం నుంచి కొండాయి, కొండాయి నుంచి ఐలాపూర్, బయ్యక్కపేట నుంచి కాల్వపల్లి, కాల్వపల్లి నుంచి కన్నెపెల్లి వరకు మట్టి రోడ్ల మరమ్మతులు, బయ్యక్కపేట జాతర నిర్వహణ పనులను చేపట్టారు. అలాగే గద్దెలకు అతి సమీపంలోని 21 ఎకరాల్లో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయనున్నారు.
- మత్స్యశాఖ ఆధ్వర్యంలో రూ.5లక్షల నిధులను వెచ్చించి జంపన్నవాగు, శివరాం సాగర్ చెరువు లోతట్టు ప్రాంతంలో గజ ఈతగాళ్ల ఏర్పాటు చేయనున్నారు.
- విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రూ. 42లక్షల నిధులను వెచ్చించి మేడారం పరిసరాల్లో 100 కేవీ పది డీటీఆర్‌లు, 3/5 వైరు లైన్లు, స్పేసర్‌లు, డీటీఆర్‌ల చుట్టు ఫెన్సింగ్, విద్యుత్ సిబ్బంది కోసం వసతి పనులను చేపట్టారు.
- జిల్లా పంచాయతీరాజ్ అధికారి ఆధ్వర్యంలో రూ. 81.52 లక్షల నిధులతో జాతర పరిసరాల్లో పారిశుధ్య పనులు చేపట్టనున్నారు. అందుకు పారిశుధ్య కార్మికులు, ఆదునిక యంత్రాలు, ట్రాక్టర్లు, డోజర్లు, ఎక్స్‌కవేటర్లు, దుర్వాసన రాకుండా బ్లీచింగ్ పౌడర్, ఈగలు, దోమలు ప్రబలకుండా లీయోబయోలిక్ రసాయనాల పిచికారీ ఏర్పాట్ల పనులను చేపట్టారు.
- పౌర సమాచారశాఖ ఆధ్వర్యంలో రూ.4.50లక్షలు వెచ్చించి జాతర పరిసరాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, భోజన వసతులు, రవాణా సౌకర్యం, జాతర సన్నివేశాలను వీడియో, ఫొటోలు తీయడం లాంటివి ఏర్పాటు చేయనున్నారు.
- మిషన్ భగీరథ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో రూ. 24.70లక్షల నిధులతో తాగునీరు, పైపులైన్లు, నల్లాల ఏర్పాట్లు, నీటి సరఫరా, చేతిపంపుల మరమ్మతులు, బోరుబావుల శుద్ధి, జంపన్నవాగులోని ఇన్‌ఫిల్టరేషన్ బావుల పూడికతీత పనులను చేపట్టనున్నారు.
- అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.80లక్షల నిధులను వెచ్చించి వన్యప్రాణుల సంరక్షణ, ఫైర్‌సేఫ్టీల ఏర్పాటు, అటవీ సంరక్షణ, మట్టి రోడ్ల అనుమతుల పనులను చేపట్టారు.
- డీడబ్ల్యూవో, ఐసీడీఎస్ శాఖల ఆధ్వర్యంలో రూ.5లక్షల నిధులను వెచ్చించి తప్పిపోయిన వ్యక్తులను గుర్తించడం, నాలుగు ప్రకటన కేంద్రాలు, తప్పిపోయిన వారి కోసం వసతి కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. కాగా పోలీసు, వైద్య, దేవాదాయశాఖ, రెవెన్యూ, ఎక్సైజ్, ఆర్టీసీ, పలు శాఖలకు కూడా నిధులు కేటాయించి మినీ జాతర ఏర్పాట్లను చేపడుతున్నారు.


ములుగులో కమ్మేసిన పొగమంచు

కమ్మేసిన పొగమంచు

- రహదారులపై రాకపోకలకు అంతరాయం
- పలు రైళ్లను వేగం తగ్గించి నడిపిన అధికారులు


ములుగు / కేసముద్రం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పొగమంచు కమ్మేసింది. బుధవారం తెల్లవారుజామున పొగమంచు దట్టంగా కమ్ముకోవడంతో రహదారులపై వాహ నాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. ఉదయం 9గంటలు దాటినా మంచు వదలకపోవడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, రోజు వారీ పనులకు వెళ్లే కార్మికులు, రైతులు ఆ మంచులోనే ముందుకు కదిలారు. బుధవారం ములుగులో ఈ సీజన్‌లో తొలిసారి ఇంతటి స్థాయిలో మంచు కురిసిందని ప్రజలు చర్చించుకున్నారు. ఇక రైళ్ల రాకపోకలు కూడా కాస్త నెమ్మదిగానే జరిగాయి. తెల్లవారుజామున సమయంలో పొగమంచు కారణంగా మహబూబాబాద్, కేసముద్రం, వరంగల్, కాజీపేట మీదుగా వెళ్లిన పలు రైళ్లను వేగం తగ్గించి నడిపారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలె వాతావరణంలో తేమ శాతం 96 చూపింది. రైల్వేట్రాక్‌పై వెళుతున్న రైళ్లు దగ్గరకు వచ్చేంత వరకు ప్లాట్‌ఫాంపై ఉన్న ప్రానికులకు కనిపించలేదు. ట్రాక్‌ను నిరంతరం పర్యవేక్షించే కీమెన్లు ఇచ్చే పొగమంచు సమాచారం ఆధారంగా ప్యాసింజర్ రైళ్లను కొంత వేగాన్ని తగ్గించి, లాంగ్ హారన్ ఇస్తూ నడిపినట్టు సిబ్బంది తెలిపారు.


ఇనుగుర్తిలో ఉదయం 8.30కు ఇలా..


కేసముద్రం రైల్వేస్టేషన్‌లో కమ్ముకున్న పొగమంచు

అరచేతిలో అపురూపం

నగర సుందరీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే వరంగల్ మహానగరంలోని పలు కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన ఫౌంటెన్లు, కళారూపాలు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఎంజీఎం కూడలి వద్ద ఏర్పాటు చేసిన అరచేతిలో శిశువు కళారూపం నగర అందాలను రెట్టింపు చేస్తోంది.



ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హన్మకొండ

వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు


మేడారంలో ముందస్తు మొక్కులు

తాడ్వాయి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడారంలో వన దేవతల దర్శనానికి బుధవారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కోరికలు తీరాలని ఎత్తు బంగారం, యా టలతో మొక్కులు చెల్లించారు. జంపన్న వాగులో పుణ్య స్నానాల అనంతరం వనదేవతలైన సమ్మక్క-సారలమ్మల వద్దకు నడుచుకుంటూ వెళ్లి చీరె, సారె, పసుపు, కుంకుమ, ఎత్తు బంగారం సమర్పించుకున్నారు. సుమారు 15వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు.

ఏకాగ్రతే విజయానికి సోపానం

- తల్లిదండ్రులు, గురువులకు రుణపడి ఉండాలి
- విషయ పరిజ్ఞానం లేని విద్య నిరుపయోగం
- ఆధ్యాత్మిక గురువు త్రిదండి చినజీయర్ స్వామి
- వరంగల్‌లో ముగిసిన సాఫల్య-2025 నైపుణ్య శిక్షణ తరగతులు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న త్రిదండి చినజీయర్ స్వామీజీ

కరీమాబాద్, జనవరి22 (ఆంధ్రజ్యోతి): ఏకాగ్రతతో చదివితే ప్రతీ విద్యార్థి విజయం సాధిస్తాడని ఆధ్యాత్మిక గురువు త్రిదండి చినజీయర్ స్వామి అన్నారు. బుధవారం వరంగల్ ఉర్సు గుట్ట వద్ద ఓ ఫంక్షన్ హాల్‌లో టెన్త్ విద్యార్థుల కోసం వడుప్సా ఆధ్వర్యంలో నిర్వహించిన సాఫల్య-2025 (నైపుణ్య శిక్షణ తరగతులు) కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విషయ పరిజ్ఞానం లేని విద్యతో ప్రయోజనం లేదని, కేవలం మార్కుల కోసం వెంపర్లాడకుండా పాఠంలోని అంతరార్థాన్ని తెలుసుకోవాలని సూచించారు. తల్లి దండ్రులకు, గురువులకు రుణపడి ఉండాలని, మీపై వారు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి కలలను సాకారం చేయాలని ఉపదేశించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన వడుప్సా బాధ్యులకు, తల్లిదండ్రులకు మంగళశాసనాలు అందజేశారు. అనంతరం ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో చదవాలని, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, పూర్తి సమయాన్ని చదువుపై పెట్టి మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. ట్రస్మా రాష్ట్ర ముఖ్య సలహాదారుడు యాదగిరి శేఖర్‌రావు మాట్లాడుతూ.. ప్రజ్ఞావికాస్ తరపున రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి ఓరియెంటేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, స్వామీజీ ఆశీస్సులతో వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆడెపు శ్యామ్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ జనరల్ సెక్రటరీ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్ల బోధనలను అర్థం చేసుకోవాలని, అదేవిధంగా స్వామీజీ సూచనలు పాటించి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అన్నారు. అంతకుముందు విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. వడుప్సా ఖిలా వరంగల్ జోన్ అధ్యక్షుడు ముక్కెర రవీందర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వడుప్సా(ట్రస్మా) బాధ్యులు అంకటి వీరస్వామి, బిల్ల రవి, ఠాకూర్ జ్ఞానేశ్వర్‌సింగ్, సతీష్, కోడెం శ్రీధర్, చక్రపాణి, రాజు, కిరణ్, వెంట్రాజం, కాంత్రికుమార్, సతీష్‌మూర్తి, ప్రవీణ్, శ్రీనివాస్, మోహన్, రవి, వెంకటేశ్వర్లు, విశ్వనాథ్, శరత్‌బాబు, ప్రసాద్, శ్రీనుబాబు, భాస్కర్, కృష్ణాకర్, వికాస తరంగిణి ప్రతినిధులు పాల్గొన్నారు.

30న కళాకారుల శోభాయాత్ర

- చిన్నజీయర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహణ
- వికాస తరంగిణి చైర్మన్ డాక్టర్ బచ్చు రాధాకృష్ణ

హనుమకొండ కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వికాస తరంగిణి హనుమకొండ, వరంగల్ జిల్లాల ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ నుంచి సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల మైదానం వరకు వందలాది మంది కళాకారులచే శోభయాత్ర నిర్వహించేందుకు విస్తృత చేస్తున్నారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో పెద్ద ఎత్తున జరిగే కళాకారుల శోభయాత్రలో వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి భజన, హరికథ, యక్షగాన, చిందు, కోలాటం లాంటి వివిధ కళా రూపాలతో వందలాది మంది కళాకారులు శోభయాత్రలో పాల్గొననున్నారు. భక్తిమార్గంలో పయనిస్తున్న వివిధ సంప్రదాయాలకు చెందిన కళారూపాలను పరిరక్షించుకోవడం ప్రధాన ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. చిన్నజీయర్‌స్వామి ఆలోచనకు ప్రతిరూపంగా కళలకు కాణాచిగా వెలుగొందుతున్న ఓరుగల్లులో పెద్ద ఎత్తున నిర్వహించాలని జీయర్‌స్వామి ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా తాము ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు వరంగల్, హనుమకొండ జిల్లాల వికాస తరంగిణి చైర్మన్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ బచ్చు రాధాకృష్ణ చెప్పారు. దార్శనికత వెలుగులో నిర్మాణం అవుతున్న హైందవ భక్తి కళామార్గమే తమ వికాస తరంగిణి ఆధ్వర్యంలో సంకీర్తన మండలి అని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కళారూపాలను ప్రదర్శించే కళాకారులతోపాటు గురువులను ప్రోత్సహిస్తూ గౌరవించడం, భక్తి కళాసంఘాలను ఏర్పర్చి సంఘటితం చేయడం, భక్తి కళాసంఘాల ద్వారా హిందు ధార్మిక విలువలను విస్తరింపజేసే లక్ష్యంతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాధాకృష్ణ చెప్పారు. ఇందుకుగాను రెండు నెలలుగా ఉమ్మడి జిల్లాలోని అనేక గ్రామీణ ప్రాంతాల్లో నిక్షిప్తమైన కళారూపాలను ప్రదర్శించే కళాకారులతో స్వయంగా అనేక సమావేశాలు నిర్వహించి వారిని ఈ కార్యక్రమానికి సమాయాత్తం చేశామన్నారు. భూపాలపల్లి జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి కళాకారులు తరలివస్తారని ఆయన పేర్కొన్నారు. ఇటీవల హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో కళారూపాలను ప్రదర్శించే గ్రూప్ టీం లీడర్లతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి వారికి మార్గదర్శనం చేశామన్నారు. ఒకవైపు భక్తి కళా సంఘాల ద్వారా సామాజిక సేవలను కూడా ప్రోత్సహింపజేసే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అన్నిరకాల కళారూపాలు ఒకేచోట శోభాయాత్ర ద్వారా నగర వాసులను కనువిందు చేసి భక్తి మార్గంలో ఓలలాండింపజేసే కార్యక్రమంలో అన్నిరంగాల కళాకారులు, కళాభిమానులు, ధార్మిక చైతన్యం కలిగిన వారు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.


చిన్నజీయర్‌స్వామి

శివ శివా.. ఏమిటిదీ?

- గాడి తప్పుతున్న కాళేశ్వరాలయ వ్యవస్థపై భక్తుల్లో అసహనం
- గర్భగుడిలో షూటింగా..? మహా పాపమంటున్న భక్తులు
- కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించాలంటూ డిమాండ్



మహదేవపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : 'సాక్షాత్తూ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి సాక్షిగా గర్భగుడిలో ఓ ఆల్బమ్ చిత్రీకరణ కోసం తలుపులు మూసి షూటింగ్ చేయడమా..? ఇది ఎంతవరకు సమంజసం.. దీనికి ఎవరు బాధ్యులు? ఎవరు బాధితులు? అంతా అయిపోయాక ఏమంటే ఏముంది?' అని భక్తురాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దక్షిణాదిన వెలిసిన త్రిలింగాలలో ఒకటిగా విరాజిల్లుతున్న పుణ్యక్షేత్రం కాళేశ్వరంలోని ముక్తీశ్వరాలయ పాలనపై అసహనం వ్యక్తమవుతోంది. కొందరు అధికారుల పట్టింపులేని తనం.. అర్చకుల చేతివాటంతో ఆలయ ప్రతిష్ఠకు భంగం కలుగుతోంది. భూపాలపల్లి జయశంకర్ జిల్లాలోని మహదేవపూర్ మండలం దక్షిణ కాశీగా పేరు ప్రఖ్యాతలు పేరుగాంచిన త్రిలింగ క్షేత్రాలలో ఒకటైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ గర్భగుడిలో సోమవారం ప్రైవేటు ఆల్బమ్ కోసం తలుపులను బంద్ చేసి ఆలయంలో రెండు లింగాల వద్ద ప్రైవేటు వ్యక్తులు షూటింగ్‌ను నిర్వహించారు. దూర ప్రాంతల నుంచి వచ్చిన భక్తులు గంటల తరబడి నిరీక్షించారు. అయినప్పటికీ కూడా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, అర్చకులు భక్తులను పట్టించుకోకుండా ఆ పాటలోనే నిమగ్నమైపోయారు. దీంతో ఆలయ పవిత్రతను దెబ్బతీశారని ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. అర్చకులు, సిబ్బంది ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా తయారై ఆలయ పాలన అస్తవ్యస్తంగా తయారైంది. సమయం పాటించకుండా అర్చకులు ఆలయ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు.

పలువురిపై అనుమానాలు

ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో మహా కుంభాభిషేకాన్ని నిర్వహించేందుకు ఆలయ అధికారులు తేదీలను ప్రకటించారు. 1972లో మహాకుంభాభిషేకాన్ని నిర్వహించగా దాదాపు 43 సంవత్సరాలకు మళ్లీ ఈ మహా కుంభాభిషేకాన్ని నిర్వహిస్తున్నారు. మే15నుంచి సరస్వతి పుష్కరాల తేదీలను కూడా ప్రకటించారు. అయితే ఈ ఉత్సవాల నిర్వహణ పనుల నిమిత్తమై ఆలయ అధికారులు శృంగేరి పీఠాధిపతుల వద్దకు వెళ్లిన క్రమంలో గర్భగుడిలో అనుమతులు లేకున్నా అర్చకులు పాట చిత్రీకరించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెంటనే దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు రామకృష్ణశర్మకు మెమోతో పాటు నోటీసులు అందజేశారు. దేవాదాయ శాఖ అధికారులు తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, తాము అందుబాటులో లేమని, తమకు ఎవరూ సమాచారం ఇవ్వలేదని తెలిపారు.


ఆలయంలో ఆల్బం చిత్రీకరణ

ఎవరికి వారే..

దేవుడు వరమిచ్చినా పూజారి దర్శనభాగ్యం కల్పించని చందంగా ఇక్కడి అర్చకులు, సిబ్బంది తీరు ఉంది. కొద్ది నెలల నుంచి ఆలయంలో పనిచేస్తున్న అర్చకులు గ్రూపు రాజకీయాలుగా తయారై వేళాపాల లేకుండా ఆలయానికి చుట్టపుచూపుగా వస్తున్నారు. ఆలయంలో పనిచేస్తున్న సిబ్బంది సైతం ఏమీ పట్టించుకోకపోవడంతో సిబ్బందిదో గ్రూపు, అర్చకులదో గ్రూపు తయారు కావడంతో ఆలయ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. గతంలో ఆలయంలో పనిచేసే ముగ్గురు అర్చక సిబ్బంది పదవీ విరమణ చేయడం, కొత్త అర్చకులను నియమించకపోవడంతో ఉన్న అర్చకులు సరైన సమయం పాటించకపోవడం, ప్రైవేటు అర్చకులకు ఆలయాన్ని అప్పజెప్పడం జరుగుతోంది. ఆలయంలో పనిచేస్తున్న రెగ్యులర్ అర్చకులు సొంత పనుల్లో నిమగ్నమైపోతున్నారు. అయినా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. గతంలో నిత్యం 20 నుంచి 30 వేలు వచ్చే ఆదాయం ఇప్పుడు రూ.4 లక్షల వరకు ఆదాయం పెరిగినప్పటికి దీనికి రెగ్యూలర్ ఈవో లేకపోవడం ఆలయానికి శాపంగా మారింది . కాగా 2024 కు గాను రూ.5 కోట్ల ఆదాయం వచ్చినట్లు సమాచారం.. ఆదాయం పెరిగే కొద్ది ఆలయ ప్రతిష్ఠను భంగపరుస్తున్నారని.. వెంటనే ఉన్నతాధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల సంఖ్య

గతంలో ఆలయానికి వచ్చే భక్తుల రద్దీ తక్కువగా ఉండడం, తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ మూడు రాష్ట్రాలను కలుపుతూ బ్రిడ్జిలు నిర్మాణం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివార్లను దర్శించుకుంటున్నారు. కానీ భక్తులు వచ్చే సమాయానికి పూజారులు లేకపోతుండటంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాళేశ్వరంలో కాలసర్పదోష నివారణ పూజలు, శని పూజలను నిర్వహించే బుధ, మంగళ వారాల్లో ఎక్కువగా రద్దీ ఉంటుంది. పెళ్లికాని యువతీ యువకులు, సంతానం లేని దంపతులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి కాలసర్ప దోష నివారణ పూజలు నిర్వహించుకుంటే వారి ఆకాంక్షలు నెరవేరుతున్నాయని నమ్ముతారు. ఇక తెలంగాణ ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో రాష్ట్రంలోని నలుమూలల నుంచి కాళేశ్వరానికి పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. గ్రూపుల సభ్యులు, మహిళా సంఘాల బాధ్యులు మూకుమ్మడిగా వస్తున్నారు. దీంతో కాళేశ్వరం ఆర్టీసీ బస్టాండ్‌లో జనం రద్దీ రోజురోజుకు పెరుగుతోంది.

గ్రామ సభలు గరం గరం




కన్నాయిగూడెం మండలంలో అధికారులతో వాగ్వాదం చేస్తున్న ప్రజలు, మహాముత్తారంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల వాగ్వాదం

కన్నాయిగూడెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన గ్రామ సభల్లో పలు చోట్ల బుధవారం నిరసనలు వ్యక్తమయ్యాయి. తాము అర్హులైనప్పటికీ సంక్షేమ పథకాల జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవని అధికారులను ప్రజలు నిలదీశారు. జాబితాలో వచ్చిన పేరుల్లో కూడా తప్పిదాలు ఉన్నాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

• మంగపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింహసాగర్, పూరేడుపల్లి, రాజుపేట, మంగపేట గ్రామపంచాయతీల్లో చేపట్టిన ప్రజా పాలన గ్రామసభలు రసాభా సగా జరిగాయి. ఇందిరమ్మ ఇళ్ల అర్హులకు రాలేదని, రేషన్‌కార్డులు సజావుగా అందడంలేదని, తదితర అంశాలపై ప్రజలు అధికారులను నిలదీశారు. ఇదేక్రమంలో అధికారులు జోక్యం చేసుకుని ఏ సమస్యలున్నా నిరంతర ప్రక్రియగా సంక్షేమ పథకాలు అందుతాయని, ఎవరూ అధైర్యపడొద్దని, అందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని అధికారులు వివరించినా ప్రజలు ఆగలేక పదేపదే నిలదీశారు. ఈక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అధికారులు ప్రజలకు కొంత సమాధానం చెప్పడంతో గ్రామసభలు ముగిశాయి. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో భద్రు, ఎంపీవో మమత, మండల వ్యవసాయ అధికారి చేరాలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

• చిట్యాల : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు అధికారులు మండలంలోని 8 గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేశారు. మండలంలోని జడల్‌పేట, పాశిగడ్డతండా, కైలాపూర్, ముచినిపర్తి, నైన్‌పాక , తిరుమలపురం (రామచంద్రాపురం), ఒడితల, ఎలేటిరామయ్యపల్లి గ్రామాల్లో ప్రజా పాలన గ్రామ సభలు నిర్వహించారు. ప్రజాపాలన, కుల గణనలో నమోదు చేసిన వివరాల ఆధారంగా నాలుగు పథకాలకు జాబితా వెలుబడలేదని పలు గ్రామాల ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా జాబితాలో తమపేర్లు రాలేదని అధికారులను నిలదీశారు. మండల అధికారులు, పోలీసులు వారికి సర్దిచెబుతూ అర్హుల నుంచి దరకాస్తులు స్వీకరించారు.

• మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వరంలో జరిగిన గ్రామసభలో గందరగోళంగా జరిగింది. వచ్చిన వారికే మళ్లీ పథకాలు వచ్చాయని, తమకు ఎందుకు మంజూరు కాలేదని పలువురు ఆందోళన చేశారు. దీంతో ఎంపీడీవో గ్రామస్థులను శాంతపరిచి మళ్లీ గ్రామంలో సర్వే నిర్వహించి అసలైన లబ్ధిదారులను ఎంపిక చేస్తామని హామీ ఇచ్చారు.

• మల్హర్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండంపేట, కొయ్యూర్ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన గ్రామసభలు రసాభాసగా మారాయి. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల్లో అర్హుల పేర్లు రాలేదని గ్రామస్థులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు ఉన్న వారికి. విశ్రాంత ఉద్యోగులు, సొంతిళ్లు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయని, అర్హులకు రాలేదని ఆరోపించారు. కొయ్యూర్‌లో సమస్య ఎంతకు సద్దుమణగక పోవడంతో పోలీసుల రంగ ప్రవేశంతో గ్రామస్థులు శాంతించారు.

• మహాముత్తారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం జరిగిన గ్రామ సభలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. లబ్ధిదారుల పేర్లు సభలో అధికారులు చదివి వినిపించగా పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకొన్న కొంత మంది అర్హులైన వారి పేర్లు ఎందుకు రాలేదని బీఆర్ఎస్‌కు చెందిన మాజీ జడ్పీటీసీ మందల రాజిరెడ్డి నిలదీశారు. మళ్లీ దరఖాస్తు ఎందుకు చేసుకోమంటున్నారని ప్రశ్నించారు. దీంతో అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు కలగజేసుకొని పదేళ్లగా అధికారంలో ఉన్నప్పుడు మీరు ప్రజలు ఏంచేశారని వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని గొడవను సద్దుమణించారు. అలాగే మండల కేంద్రంలో జరిగిన గ్రామ సభలో కాంగ్రెస్‌కు చెందిన మాజీ జడ్పీటీసీ లింగమల్ల శారదను వేదికపై ఎందుకు కూర్చోబెట్టారని బీఆర్ఎస్‌కు చెందిన మాజీ జడ్పీటీసీ మందల రాజిరెడ్డి ప్రశ్నించారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పదోన్నతులు బాధ్యతలను మరింత పెంచుతాయి : ఎస్పీ శబరీశ్



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్సైలు

ములుగు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పదోన్నతులు విధి నిర్వహణలో బాధ్యతలను మరింత పెంచుతాయని జిల్లా ఎస్పీ శబరీశ్ అన్నారు. జిల్లాలో పనిచేస్తున్న ఏడుగురు ఏఎస్సైలు ఇటీవల ఎస్సైలుగా పదోన్నతి పొందారు. వారంతా బుధవారం ఎస్పీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అభినందించిన ఎస్పీ శబరీశ్ మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.

టీకాల కార్యక్రమాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌వో

వెంకటాపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జవహర్‌నగర్ ఆరోగ్య ఉపకేంద్రంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు బుధవారం పరిశీలించారు. ముందుగా ఆయన సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు పిల్లలకు సరైన సమయంలో ఇప్పించాలన్నారు. ఒకరోజు ముందస్తు వ్యాధి నిరోధక టీకాలు తీసుకునే పిల్లల జాబితా తయారు చేసుకుని టీకాలు ఇచ్చే కేంద్రానికి తీసుకురావాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. అనంతరం జాతీయ టీబీ నియంత్రణ, లెప్రసీ కార్యక్రమం అమలుతీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ, కీటకజనిత లెప్రసీ నిరోధక ప్రోగ్రాం అధికారి చంద్రకాంత్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేదలకు పథకాలు అమలు చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మల్లికార్జునరావు

ములుగు కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభల్లో అధికారులు నిరుపేదలను గుర్తించి ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లాకేంద్రంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్లు, ఇతర పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా చూడాలన్నారు. అదేవిధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్, నాయకులు ముత్యాల రాజు, బండి నర్సయ్య, జక్కుల ఐలయ్య, మాతంగి శ్యామ్, సాగర్, మణిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి, పునరావాస పథకానికి దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలి

ములుగు కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు ఉపాధి, పునరావాస పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి కె.శిరీష బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఈ పథకం కింద ములుగు జిల్లాకు 8 యూనిట్ల ద్వారా రూ.4 లక్షల సబ్సిడీ మంజూరు అయిందని తెలిపారు. ఎలాంటి బ్యాంకు లింకేజీ లేకుండా లబ్ధిదారులకు నేరుగా రూ.50 వేల సబ్సిడీ అందుతుందని పేర్కొన్నారు. 40 శాతానికిపైగా వైకల్యం ఉండి 21 నుంచి 55 ఏళ్ల లోపు లబ్ధిదారులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్‌వోబీఎంఎంఎస్.సీజీజీ.జీవోవీ.ఇన్ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో ఈనెల 23 నుంచి ఫిబ్రవరి 2 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

రామ్మూర్తిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ములుగు కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నేత మంద కృష్ణను అవమానించిన మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు ఇరుగు పైడి ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు బుధవారం జిల్లా ఎస్పీ శబరీశ్‌కు ములుగులో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా పైడి మాట్లాడుతూ రామ్మూర్తి అనుచిత వ్యాఖ్యలు చేస్తూ మాదిగల మనోభావాలను దెబ్బతీసేవిధంగా వ్యవహరించడం సరికాదని, మంద కృష్ణ మాదిగపై దుష్ప్రచారం చేస్తూ ఆయన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వ్యాఖ్యానించడం తగదని అన్నారు. ప్రభుత్వం రామ్మూర్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుని అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్,ఎంఎస్‌పీ నాయకులు మడిపెల్లి శ్యాంబాబు, మరాఠి రవీందర్, తోకల రాంబాబు, దూడపాక రాజు, కార్తీక్, పుల్లూరి కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

• వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి): ఎస్సీవర్గీకరణ కోసం పోరాడుతున్న మంద కృష్ణ మాదిగను అవమానించిన మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తిని అరెస్టు చేయాలని కోరుతూ ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి కాడపాక శ్యామ్ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సతీష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మోరె లింగస్వామి, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు దొమ్మటి రమేష్, నాయకుడు గడ్డమీది సంపత్, కాడపాక రాజు, గడ్డం రమేష్, గాజుల శ్రీనివాస్, కిరణ్, అనిల్, అశోక్ పాల్గొన్నారు.

• వాజేడు (ఆంధ్రజ్యోతి): మందకృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పశువుల రామ్మూర్తిపై ఎమ్మార్పీఎస్ నాయకులు వాజేడు పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మండల అధ్యక్షుడు చెన్నం స్వామి, నాయకులు లేగల రవి మాదిగ, చిట్యాల రాకేష్ మాదిగ, తదితరులు ఉన్నారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్

కాకతీయఖని, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-5వ గనిలో పనిచేస్తూ విధులకు గైర్హాజరవుతున్న కార్మికులకు బుధవారం అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. 2024లో 101 మస్టర్ల కన్నా తక్కువ ఉన్న కార్మికులను, వారి కుటుంబ సభ్యులను ఆహ్వానించి మాటాడారు. కార్మికులు క్రమం తప్పకుండా విధులకు రావాలన్నారు. వారు విధులకు హాజరయ్యేలా కుటుంబ సభ్యులు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ జాకీర్ హుస్సేన్, సంక్షేమ అధికారి సందీప్‌కుమార్, కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాలకు నేడు వేలం

భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు గురువారం వేలం నిర్వహిస్తున్న ఎక్సైజ్ సీఐ రమ్య బుధవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు తమ కార్యాలయంలో ఉంటుందని, వేలంలో పాల్గొనే వారు 50 శాతం సొమ్మును ముందస్తుగా చెల్లించి మిగిలిన సొమ్మును వాహనం పొం దిన తర్వాత చెల్లించాల్సి ఉంటుందన్నారు. మొత్తంగా వివిధ రకాల 30 వాహనాలు ఉన్నాయని, ఆసక్తి ఉన్న సకాలంలో వేలంలో పాల్గొనాలని ఆమె కోరారు.

ముగిసిన శ్రీపాద స్మారక క్రికెట్ టోర్నమెంట్



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దుద్దిళ్ల శ్రీనుబాబు

మహదేవపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వరంలో మహదేవపూర్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు లేతకార రమ్య రాజబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీపాద స్మారక టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా శ్రీపాదరావు కుమారుడు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ముందుగా పొలిటికల్ జట్టు వర్సెస్ ప్రెస్ జట్టు క్రికెట్ ఫ్రెండ్లీ మ్యాచ్ ఆటను శ్రీనుబాబు ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

రోడ్డ భద్రతా నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న రవాణా శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి సమ్దానీ

భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని రవాణాశాఖ, పోలీస్‌శాఖ సంయుక్తంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గణేష్‌చౌక్‌లోని హనుమాన్ ఆలయం నుంచి విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులతో కలిసి అవగాహణ ర్యాలీని అంబేద్కర్ కూడలి వరకు నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ కూడలీలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. రవాణా శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి ఎం.డి. సమ్దానీ, భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, సీఐ నరేష్‌కుమార్ హాజరై మాట్లాడారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందన్నారు. వాహనదారులు ఇంట్లో నుంచి బయటకు వెళ్లినప్పుడు తిరిగి తమ రాక కోసం కుటుంబ సభ్యులు ఎదురు చూస్తారనే విషయాన్ని మరిచిపోవద్దన్నారు. చిన్నచిన్న నిర్లక్ష్యాల కారణంగానే చాలా మంది ప్రమాదాల భారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమ నిబంధనలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సుధాకర్, ఏఎంవీఐలు సుందర్‌లాల్, శ్రీనివాస్, ట్రైనీ ఉమెన్ ఎస్సై గీత, నెహ్రూ యువ కేంద్ర ప్రతినిధులు, విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్సై ఎస్.కె. తాజుద్దీన్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు సందర్భంగా బుధవారం పోలీస్ సిబ్బందితో కలిసి ఎస్సై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రతి వాహనదారుడు నిబంధనలను కచ్చితంగా పాటించాలని, త్రిబుల్ రైడింగ్ చేయరాదని సూచించారు. మైనర్లు డ్రైవింగ్ చేయకూడదని, ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే గండ్ర



అంకుషాపూర్ గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

టేకుమట్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. రైతుభరోసా, రైతు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు తదితర పథకాల అమలు నిరంతర ప్రక్రియని అన్నారు. మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో జరిగిన ప్రజా పాలన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాబితాల్లో పేర్లు లేని అర్హులుంటే గ్రామ సభలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనివార్య కారణాల వల్ల గ్రామ సభలో దరఖాస్తు చేసుకోని వారు నేరుగా ఆయా శాఖల అధికారులకు ఇవ్వొచ్చని సూచించారు. అనంతరం అంకుషాపూర్ గ్రామ యూత్ అధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శైలజ, తహసీల్దార్ విజయలక్ష్మి ఎంపీడీవో అనిత, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్, నాయకులు దొంతుల శ్రీనివాస్, తోట గట్టయ్య, సంపత్, మహేందర్, సంగి రవి, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపలి (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని పిడిసిల్ల గ్రామంలో బుధవారం జరిగిన ప్రజాపాలన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాగులో ఉన్న భూములకు మాత్రమే రైతు భరోసా అందుతుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా భూమిలేని నిరుపేదలకు ఏడాదికి రూ.12వేలను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్‌కార్డు కూడా మంజూరు చేయలేదని, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డు అందించనుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ సునీత, తహసీల్దార్ సునీత, ఎంపీడీవో హుస్సేన్, ఏఎంసీ చైర్మన్ శ్రీదేవి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింగరావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఎమ్డీ.రఫీ, మండల వ్యవసాయ అధికారి సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు కట్టంగూరి రామ్‌నర్సింహ రెడ్డి, ఆకుతోట కుమారస్వామి, తక్కళ్లపల్లి రాజు, నడిగోటి రాము, దండ వెంకటేశ్వర్‌రెడ్డి, సుమన్, లింగారెడ్డి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి

పీఏసీఎస్ అధ్యక్షుడు ఎల్లారెడ్డి

గోవిందరావుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గోవిందరావుపేట ప్రాథమిక సహకార పరపతి సంఘం అధ్యక్షుడు పన్నాల ఎల్లారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మొట్లగూడెం, బుస్సాపూర్, గాంధీనగర్, పాపయ్యపల్లి, బాలాజీనగర్, రాంనగర్ గ్రామాల్లో ప్రజాపాలన గ్రామ సభలు జరుగగా ఎల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తూ తల్లి సోనియమ్మ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని, ఆ రాష్ట్రాన్ని బీఆర్ఎస్‌పార్టీ పదేళ్ల దొరల అహంకారపూరిత చర్యలతో పాలించిందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో ప్రజలందరినీ భాగస్వాములు చేసి ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి సంక్షేమ పథకం నిజమైన లబ్ధిదారులకు చేరాలనే ఉద్దేశంతో ఇంటింటి సర్వే నిర్వహించడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదికాలంలోనే ఉద్యోగ నోటిఫికేషన్లు వేసి 5300 ఉద్యోగాలను భర్తీచేసిందని, ఇంకా గ్రూప్స్, మెడికల్ సంబంధిత 20వేల ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ వచ్చేనెల వరకు వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


రాఘవరెడ్డిపేటలో ముగ్గురిపై కుక్కదాడి

టేకుమట్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవరెడ్డిపేట గ్రామంలో బుధవారం ముగ్గురు వ్యక్తులపై ఓ కుక్క దాడి చేసి గాయపరిచింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అనుప స్వామి, దాసరి సమ్మయ్య, గుమ్మడి లక్ష్మి తమ ఇళ్ల ఆవరణలో ఉండగా వారిపై ఒకే కుక్క వేర్వేరు సమయాల్లో దాడి చేసింది.

సింగరేణి జీఎంకు గ్రామస్థుల వినతి

మల్హర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్‌సాన్‌పల్లిలో అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరుతు గ్రామ మాజీ సర్పంచ్ గుగులోతు జగన్‌నాయక్ ఆధ్వర్యంలో సింగ రేణి జీఎంకు వినతి పత్రం బుధవారం అందించారు. గ్రామంలోని హనుమాన్, నాగులమ్మ, పోచమ్మ దేవాలయాల్లో షెడ్లు, గేట్ల నిర్మా ణంతో పాటు బస్టాప్, గ్రామంలోని ప్రైమరీ స్కూల్లో స్టేజీల నిర్మా ణానికి మెటీరియల్స్ ఇప్పించి అభివృద్ధికి సహకరించాలని పేర్కొన్నారు.

బుర్ర రామస్వామికి డాక్టరేట్



భూపాలపల్లిటౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణానికి చెందిన బుర్ర రామస్వామిగౌడ్‌కు ఏషియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ అకాడమీ న్యూఢిల్లీ వారు డాక్టరేట్ అందించారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రామస్వామి ఈ ఈ డాక్టరేట్‌ను అందించారు. గత 40ఏళ్లుగా ఆధ్యాత్మిక సేవలో తనదైన సేవలను అందిస్తున్నారని అకాడమీ చైర్మన్ ఆకుల రమేష్ తెలిపారు.

నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి ఎక్సైజ్ అధికారులు బుధ వారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు భూపాలపల్లి ఎక్సైజ్ పరిధి సిబ్బందితోపాటు వరంగల్ డీటీఎఫ్ సిబ్బంది సమన్వయంతో పెద్దకుంటపల్లి గ్రామంలో తనిఖీ చేసి నాటుసారాను గుర్తించి ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ మేరకు ఎక్సైజ్ సీఐ రమ్య వివరాలు వెల్లడించారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు ఆకస్మిక దాడులు చేయగా 20 లీటర్ల నాటుసార, 1200 లీటర్ల చెక్కర పానకం లభ్యమైంది. ఇట్టి సారా ఘటనపై నాలుగు కేసులు నమోదు చేసి.. తయారీదారులు ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఆమె వివరించారు. అనంతరం గ్రామంలో నాటు సారా అనర్థాలను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఇకనైనా తయారీ, అమ్మకందారుల్లో మార్పు రావాలని, లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ డీటీఎఫ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి : సీపీఎం

గోవిందరావుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాకేంద్రంలో ఈనెల 25నుంచి 28వతేదీ వరకు జరిగే సీపీఎంపార్టీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పొదిళ్ల చిట్టిబాబులు పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు పాల్గొని రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలకు రైతులు, కూలీలు, నిరుద్యోగులు, పేదలు, అసంఘటితరంగ కార్మికులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు గొంది రాజేష్, తీగల ఆగిరెడ్డి, నాయకులు కడారి నాగరాజు, ఉపేంద్రచారి, కందుల రాజేశ్వరి, మంచాల కవిత, అశోక్, గణేష్, సామ మహేష్, కడారి అశోక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అపార్ ఐడీ తప్పనిసరి : డీఈవో

కాటారం, జనవరి 22(ఆంధ్రజ్యోతి):పాఠశాల నుంచి మొదలుకుని ఉన్నత విద్యాలయం వరకు..వాటిలో నమోదైన ప్రతి విద్యార్థికి ఏపీపీఏఆర్ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీ జనరేట్ చేయాల్సి ఉంటుందని జిల్లా విద్యాధికారి ఎం రాజేందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర గురుకులంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్ఎంలు, ఆయా స్కూల్స్ కార్యాలయసిబ్బందికి బువారం విద్యాశాఖ ఆధ్వర్యంలో అపార్ ఐడీ జనరేషన్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. దీనిని తనిఖీ చేసిన డీఈవో రాజేందర్ మాట్లాడుతూ ప్రజలందరికి తప్పనిసరిగా ఆధార్ కార్డులున్నట్లే విద్యార్థులకు అపార్ ఐడీ కార్డులు అందుతాయన్నారు. విద్యార్థులకు ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే ఏపీపీఏఆర్ ఐడీ జనరేట్ చేస్తే భవిష్యత్‌లో ఇబ్బందులు లేకుండా ఉంటుందన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులందరికీ రెండు రోజుల్లో ఐడీ జనరేట్ ప్రక్రియ పూర్తి చేయాలని, ఏవైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీదేవి, సెక్టోరియల్ అధికారి రాజగోపాల్, జీసీడీవో శైలజ, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ సుదర్శన్, సీఆర్‌పీలు తిరుపతిరెడ్డి, రవిశంకర్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

వెంకటాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని సీపీఎం మండల కార్యదర్శి గ్యానం వాసు విమర్శించారు. మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరగగా ఆయన మాట్లాడారు. గత రెండు రోజులుగా జరుగుతున్న ప్రజాపాలన గ్రామసభల్లో అర్హులైన లబ్ధిదారుల పేర్లు కనిపించడంలేదని ప్రజలు ఆందోళన చేస్తున్న ఘటనలు ఎదురవుతున్నాయని అన్నారు. ఈనెల 25నుంచి 28వతేదీ వరకు సంగారెడ్డి జిల్లాకేంద్రంలో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు కట్ల నర్సింహచారి, చిట్టెం ఆదినారాయణ, తోట నాగేశ్వర్‌రావు, ఆనంద్, విజయ్, దేవి, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థుల క్షేత్ర పర్యటన

ఏటూరునాగారం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, బీఏ, బీకాం విద్యార్థులు యువ టూరిజం క్లబ్, సోషల్ సైన్సెస్, కామర్స్ డిపార్ట్మెంట్ల ఆధ్వర్యంలో క్షేత్ర పర్యటన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని రేగొండ మండలంలోని పాండవుల గుట్టకు విద్యార్థులను తీసుకెళ్లారు. ప్రాక్ యుగం నుంచి చారిత్రక యుగం వరకు వేయబడిన వివిధ రాతి చిత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి. రేణుక, యువ టూరిజం క్లబ్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త సి.హెచ్. వెంకటయ్య, తెలుగు, పొలిటికల్ సైన్స్, ఆర్థిక శాస్త్రము, కంప్యూటర్స్, కామర్స్ విభాగాల అధ్యాపకులు సంపత్, రమేష్, భాస్కర్, మున్ని, శేఖర్ పాల్గొన్నారు.

ఓర్వలేక బురదజల్లే ప్రయత్నం: కాంగ్రెస్

వాజేడు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ విమర్శించారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అర్హులైన ప్రతి ఒక్కరి సంక్షేమ పథకాలు అందాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన గ్రామసభలలో బీఆర్ఎస్ నాయకులు అనవసరపు రాద్ధాంతాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. గ్రామసభల్లో అర్హుల జాబితాలో అర్హుల పేర్లు లేకుంటే గ్రామసభల వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు దంతులూరి విశ్వనాథ ప్రసాదబాబు రాజు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ జగన్నాథరాజు, ఖాజావలీ, మల్లె దుర్గారావు, చెన్నం ఎల్లయ్య, తల్లడి నానబాబు తదితరులు పాల్గొన్నారు.